రహదారిలో గోతులు.. ప్రయాణికుల పాట్లు

పారిశ్రామిక ప్రాంతంలో భూగర్భ పైప్‌లైన్ పనులతో సమస్యలు



గోతులు తవ్వే సమయంలో గుల్లలపాలెం సర్వీస్ రోడ్డులో నిలిచిన ట్రాఫిక్



గుల్లలపాలెం వద్ద గోతులు సరిగ్గా పూడ్చకపోవడంతో రాత్రి వేళలో ఇబ్బందులు

- రోడ్లను తవ్వి సక్రమంగా పూడ్చని వైనం
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహన చోదకులు

మల్కాపురం: భూగర్భ పైప్‌లైన్ పనుల నిమిత్తం రహదారుల్లో తవ్విన గోతులను సక్రమంగా పూడ్చకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 61వ వార్డు మల్కాపురం నుంచి 59వ వార్డు పాత చెక్‌పోస్ట్ ఏరియా మార్గంలో రాకపోకలు సాగించే వాహన చోదకులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సర్వీస్ రోడ్డులో విద్యుత్ లైట్ల సౌకర్యం లేకపోవడంతో రాత్రి వేళ చీకట్లలో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

నిర్లక్ష్యంగా పనులు..

పారిశ్రామిక ప్రాంత ప్రజల తాగునీటి అవసరాల కోసం జీవీఎంసీ ప్రాజెక్ట్ అధికారులు గాజువాక ఆర్టీసీ డిపో వద్ద గల భారీ రిజర్వాయర్ నుంచి పాత చెక్‌పోస్ట్, 59వ వార్డు నక్కవానిపాలెం, 60వ వార్డు గుల్లలపాలెం వరకు ఉన్న సర్వీస్ రోడ్డులో రెండు వారాలుగా గోతులు తవ్వుతున్నారు. భూగర్భంలో పైప్‌లైన్లు అమర్చేందుకు చేపడుతున్న ఈ పనుల్లో భాగంగా వచ్చిన మట్టిని వాహనాలు రాకపోకలు సాగించే సర్వీస్ రోడ్డుపై నిర్లక్ష్యంగా విడిచిపెడుతున్నారు.నిజానికి పైప్‌లైన్ పనుల నిమిత్తం తవ్విన గోతులను భూగర్భంలో పైప్‌లైన్ అమర్చిన వెంటనే పూడ్చాల్సి ఉంది. అది కూడా గుంతలు లేకుండా, ఆ మార్గాన వచ్చే వాహన చోదకులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేలా గోతులు పూడ్చాలి. సదరు కాంట్రాక్టర్ తవ్విన గోతులను సరిగ్గా పూడ్చడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సర్వీస్ రోడ్డుపై రోజుల తరబడి మట్టి కుప్పలను నిర్లక్ష్యంగా వదిలిపెట్టడం, తవ్విన గోతుల్లో మట్టి సరిగ్గా పూడ్చకపోవడంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.



నక్కవానిపాలెం సర్వీస్ రోడ్డులో సక్రమంగా పూడ్చని గోతులు

అంధకారంలో ప్రయాణం

గుల్లలపాలెం నుంచి కోరమాండల్ వద్ద గల శ్మశానవాటిక వరకు విద్యుత్ షో ల్యాంప్స్ వెలగకపోవడంతో ఆ మార్గంలో రాత్రి వేళ అంధకారం నెలకొంటోంది. దీనికి తోడు మట్టి దిబ్బలు, రహదారుల్లో గోతులు సరిగ్గా పూడ్చకపోవడం వంటి సమస్యలతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి తవ్విన గోతులను సక్రమంగా పూడ్చేలా చర్యలు తీసుకోవాలని, పనులు ముగిసిన వెంటనే బీటీ రోడ్డు నిర్మించాలని పాదచారులు, వాహన చోదకులు కోరుతున్నారు.

రాత్రి వేళలో ఇక్కట్లు



నక్కవానిపాలెం నుంచి గుల్లలపాలెం వరకు గల సర్వీస్ రోడ్డులో తవ్విన గోతుల వల్ల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాం. ఈ మార్గంలో రాత్రి వేళ విద్యుత్ లైట్లు లేకపోవడంతో వాహనం అదుపుతప్పి గాయపడుతున్నాం. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– పెద్దాడ వెంకటరమణ, ములగాడ

ఎన్నిసార్లు రోడ్డును తవ్వుతారు

శుభ్రంగా ఉన్న సర్వీస్ రోడ్డును వివిధ పనుల పేరిట పదేపదే తవ్వడం, ఇలా ఏర్పడిన గోతులను సరిగ్గా పూడ్చకపోవటం షరామామూలుగా మారింది. సర్వీస్ రోడ్డులో పెద్ద కాలువ నిర్మించి, దానిలో పైప్‌లైన్, వివిధ కేబుల్ లైన్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– ఖాన్, శ్రీహరిపురం

చీకటి గుహల్లా అండర్‌పాస్‌వేలు



చీకటి గుహను తలపిస్తున్న చంద్రనగర్ అండర్‌పాస్‌వే

గోపాలపట్నం: పాత గోపాలపట్నం, చంద్రనగర్ ప్రాంతాలకు వెళ్లే రహదారిలోని అండర్‌పాస్‌వేలు చీకటి గుహల్లా తయారయ్యాయి. రాత్రి సమయాల్లో ఈ దారి గుండా వెళ్లాలంటే స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. అండర్‌పాస్‌వేలో కొంత మేరకు ఒకటి రెండు లైట్లు వేసి వదిలేశారని చెబుతున్నారు. కొంతమేర వెలుగు ఉండి మిగిలిన ప్రాంతమంతా చీకటిమయంగా తయారై భయపెడుతోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అండర్‌పాస్‌వేల్లో వెలుగులు ప్రసరించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యుత్ లైట్లు వెలగక ఇబ్బందులు



తుమ్మడపాలెంలో వెలగని విద్యుత్ లైటు

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఊర్వశి కూడలి పరిధి సుభాష్‌నగర్, తుమ్మడపాలెం ప్రాంతాల్లో పది రోజులుగా విద్యుత్ లైట్లు సక్రమంగా వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. 12ఏ/1 నంబర్ గల విద్యుత్ స్తంభాల లైట్లు వెలగకపోవడంతో అటుగా రాకపోకలు సాగించే పాదచారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి నిత్యం వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాలవాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఎర్నిమాంబకు పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

గోపాలపట్నం: వెంకటాపురం ఎల్‌జీ పాలిమర్స్ లాండ్ లూజర్స్ అసోసియేషన్ సభ్యులు తమ సమస్యలను గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం ఆయనను కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఫ్యాక్టరీ మూసివేయడం వల్ల కాంట్రాక్ట్ కార్మికులు ఉపాధి కోల్పోయారని అసోసియేషన్ సభ్యులు వాపోయారు. ఈ ఫ్యాక్టరీపై ఆధారపడ్డ కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితిని ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

కేవీల్లో చక్కగా విద్యా బోధన



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు

కంచరపాలెం: కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ శ్రీవిజయనగర్ కాలనీలో గల కేంద్రీయ విద్యాలయం – 2లో విద్యాలయ సంఘటన్ 62వ స్థాపన దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు లలితకుమారి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం లలితకుమారి మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాలు విలువలతో కూడిన విద్య బోధిస్తాయని, భారతీయ సంస్కృతి, జాతీయ సమైక్యతకు అద్దం పడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు బాలాజీ, రామచంద్రరావు, లక్ష్మి, శివకుమార్ జ్యోత్స్న, జ్యోతిప్రకాష్ పాల్గొన్నారు.

దత్తాత్రేయునికి ఘనంగా పూజలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం ఉడాకాలనీ వద్ద గల మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సాయిబాబా మందిరంలో కొలువుదీరిన దత్తాత్రేయునికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. దత్త జయంతి సందర్భంగా అర్చకులు నిర్వహించిన పూజల్లో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు భక్తులు పాల్గొని దత్తాత్రేయునికి అభిషేకాలు చేశారు.

చిత్రకారుడు భాస్కర్‌రావుకు పురస్కారం



చెల్లూరి భాస్కర్‌రావును సత్కరిస్తున్న హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సభ్యులు

సింథియా : ప్రముఖ చిత్రకారుడు చెల్లూరి భాస్కర్‌రావుకు హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నిర్వాహకులు ఆదివారం సేవా పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. పారిశ్రామిక ప్రాంతంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భాస్కర్‌రావును గుర్తించి సత్కరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొడ్డపాటి దాసు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో చిత్రకారుడు భాస్కర్‌రావు పిల్లలకు ఉచితంగా చిత్రలేఖనంలో శిక్షణ ఇవ్వడం, వారిని ప్రోత్సహించుందుకు పలు పోటీలకు పంపడం, అనాథలు, బిచ్చగాళ్లను అక్కున చేర్చుకుని పోలీసుల సహకారంతో వారిని ఆశ్రమానికి తరలించడం, వారికి సహాయ సహకారాలు అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం భాస్కర్‌రావు మాట్లాడుతూ పురస్కారంతో తన బాధ్యత మరింత పెరిగిందని, భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు మరింత ఉత్సాహాన్ని అందించిందని పేర్కొన్నారు.

బుచ్చిరాజుపాలెంలో క్రిస్మస్ సందడి



పాటలు పాడుతున్న సండే స్కూల్ చిన్నారులు

గోపాలపట్నం : స్థానిక బుచ్చిరాజుపాలెం జయప్రకాష్‌నగర్‌లోని ప్రార్థన మందిరంలో సంఘ కాపరి సిస్టర్ పీస్ ఏంజెల్ బ్లెస్సి ఆధ్వర్యంలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సండే స్కూల్ పిల్లలు పాటలు పాడి అలరించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ యేసు పుట్టుక, ఏసు ప్రభువు బైబిల్‌లో చెప్పిన మాటలు వివరించారు. పిల్లలంతా దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండాలని సూచించారు. వ్యసనాలకు బానిసలవకుండా, తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు పేరుప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సండే స్కూల్ పిల్లలు, టీచర్లు, ఎరుషలేము ప్రార్థన మందిరం సభ్యులు పాల్గొన్నారు.

తెలుగుదనానికి ప్రతీక బాపు



బాపు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చిత్రకారులు

మల్కాపురం: సినీ దర్శకుడు, చిత్రకారుడు, పద్మశ్రీ బాపు జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. 59వ వార్డు హిమాచల్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బాపు చిత్రపటానికి చిత్రకళా పరిషత్ ప్రతినిధి సుంకర చలపతిరావు, కార్టూనిస్ట్ సంబంగి, చిత్రకారుడు డి.శ్రీనివాస్ మనోహర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిత్రకారుడు, రచయిత, సీనియర్ జర్నలిస్ట్ సుంకర చలపతిరావు మాట్లాడుతూ బాపు ప్రత్యేకమైన చిత్రకారుడని, ఆయన చిత్రాలు ఎందరో చిత్రకారులకు ఆదర్శమని పేర్కొన్నారు. భారతం, భాగవతం, శ్రీకృష్ణలీలలు, రామాయణం వంటి పురాణ, ఇతిహాస చిత్రాలను చిత్రించి.. నేటికీ మన కళ్ల ముందు మెదిలేలా చేసిన బాపు తెలుగుదనానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు చిత్రకారులు, కార్టూనిస్టులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

ఉత్సాహంగా పోర్ట్ స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పోర్ట్ స్కూల్ పూర్వ ఉపాధ్యాయులు, అసోసియేషన్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: విశాఖ పోర్టు స్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా సాగింది. పోర్టు స్కూల్‌లో ప్రారంభం నుంచి చివరి వరకు విద్యనభ్యసించిన వివిధ బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు సాలగ్రామపురంలో గల స్కూల్ ప్రాంగణంలో ఉత్సాహంగా గడిపారు. ఈ సమ్మేళనానికి అధ్యక్షత వహించిన అసోసియేషన్ అధ్యక్షుడు నాగనబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ పోర్టు స్కూల్‌లో చదువుకున్న వారంతా నేడు ఉన్నత స్థానాల్లో దేశ విదేశాల్లో స్థిరపడ్డారన్నారు. సుమారు ఆరున్నర దశాబ్దాల పాటు 1965 నుంచి 2015 వరకు ఎందరో ఉత్తమ విద్యార్థులను పోర్టు స్కూల్ తీర్చిదిద్దిందని గుర్తు చేశారు. ఈ సమ్మేళనానికి ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, తుని, శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఈ పాఠశాలలో పనిచేసిన సుమారు 45 మంది అధ్యాపకులను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. సమ్మేళనంలో అనుపమ, దేముడుతోపాటు పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షులు ఆర్.అనిల్‌కుమార్, ఆర్.రమణబాబు, జి.చందు, సంయుక్త కార్యదర్శి జి.రమణబాబు, సహాయ కార్యదర్శి జి.ప్రవీణ్‌కుమార్, కోశాధికారి ఎ.హరి కుమార్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో స్నేహితుల మధ్య గొడవ

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు స్నేహితుల మధ్య మద్యం మత్తులో గొడవ జరిగింది. మోహన్ సాయి అనే యువకుడిపై కార్తీక్ అనే వ్యక్తి బీర్ బాటిల్‌తో దాడి చేసినట్టు సమాచారం. గతంలో ఇద్దరి మధ్య వివాదం జరిగిందని, ఆ విషయమై క్షమాపణ చెబుతానని మోహన్ సాయిని కార్తీక్ పిలిచి దాడికి పాల్పడడంతో మోహన్ సాయికి గాయాలయ్యాయి. గాయపడ్డ సాయిని ఆస్పత్రికి తరలించారు. కార్తీక్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసు విషయమై పోలీసులు స్పందించడం లేదు. బాధితులు కూడా మీడియాకు సమాచారం అందించడానికి ఆసక్తి చూపడం లేదు.

అద్భుతంగా వేద సదస్యం




బీవీకే కళాశాలలో వేదపఠనం చేస్తున్న వేద పండితులు

సీతంపేట : వేద పండితుల వేద పఠనంతో స్థానిక బీవీకే కళాశాల ప్రాంగణం ఆధ్యాత్మికతతో పరిమళించింది. కాసలనాడు బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్‌లో గల బీవీకే కళాశాల ప్రాంగణంలో సంఘ సభ్యులతో ఆత్మీయ కలయిక నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు శిష్టాలక్ష్మీ నరసింహమూర్తి, కార్యదర్శి శిష్టా క్షీరసాగర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సమాజ సంక్షేమం కోసం ప్రముఖ వేద పండితులు వేద పఠనం చేశారు. ఈ వేద సదస్యంలో ప్రముఖ వేద పండితులు, సప్తరుషి పీఠం నిర్వహణాధిపతి మామిల్లపల్లి మాధవశర్మ, వారి శిష్య బృందం పాల్గొని వేద పఠనం చేశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. కవి, రచయిత దేవులపల్లి దుర్గాప్రసాద్ చేసిన వ్యాఖ్యానం ఆకట్టుకుంది. సంఘ సభ్యుల పిల్లలకు ఉపకార వేతనాలు అందజేశారు. సంఘ సభ్యులకు, కుటుంబ సభ్యులకు ఆటవిడుపుగా పురాణ విశేషాలపై ప్రశ్నలతో క్విజ్ పోటీ నిర్వహించారు. శిష్టా అంజన సంస్కృతి గాత్ర కచేరీ అలరించింది. కార్యక్రమంలో సంఘ సభ్యులు కాలనాథభట్ట శ్రీరామశాంతి స్వరూప్, మామిళ్లపల్లి నాగబాబు, మిస్సుల సూర్యనారాయణ, మిస్సుల రామాంజనేయులు, నూకల నరసింహమూర్తి, మిస్సుల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

చిల్లర నాణేల పంపిణీ

సీతమ్మధార: వినియోగదారులకు, వర్తకులకు చిల్లర నాణేలు కొరత లేకుండా సీతమ్మధార రైతుబజారులో కనక మహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు సభ్యులు ఆదివారం పంపిణీ చేశారు. రైతులకు, వినియోగదారులకు రూ.3.50 లక్షల విలువ గల రూ.1 నుంచి రూ.20ల వరకూ గల అన్ని చిల్లర నాణేలు, నోట్లు అందజేశారు. బ్యాంకు ముఖ్యకార్యనిర్వహణాధికారి కె.శ్యామ్ కిషోర్, మేనేజర్ కె.విశ్వనాథం, ఇతర సిబ్బంది పాల్గొని పంపిణీ చేశారు. అనంతరం శ్యామ్ కిషోర్ మాట్లాడుతూ బ్యాంకు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని రైతుబజార్లలో చిల్లర నాణేలు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బందితో పాటు రైతుబజార్ ఈవో కొండబాబు, అటెండర్ సతీష్ పాల్గొన్నారు.

ముగిసిన ఘంటసాల గానోత్సవాలు



పోలీస్ కమిషనర్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

డాబాగార్డెన్స్: అమర గాయకుడు ఘంటసాల 102వ జయంతి సందర్భంగా అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఘంటసాల గానోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. కార్యక్రమంలో పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ ఘంటసాల గీతాలు అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. గాయకులను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు నేతృత్వం వహించిన కార్యక్రమంలో పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, సంస్థ గౌరవ అధ్యక్షుడు కొణతాల రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నగర సీపీని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ముందుగా జరిగిన సంగీత విభావరిలో బంగార్రాజు, భాగ్యలక్ష్మి, విశ్వప్రసాద్, కోమలి, రామ నరసింహం పాడిన తెల్లవార నీకు ఈరేయిని వంటి గీతాలు ఆకట్టుకున్నాయి. వీరితో పాటు వీరేంద్ర, షాను బొమ్మిడి సత్యనారాయణ, రాము, మనోహర్ తదితరులు ఘంటసాల గీతాలు చక్కగా ఆలపించారు. సోమేష్ సంగీత సారథ్యంలో జరిగిన విభావరికి మధుపాడ రమణి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

సత్యాగ్రహ దీక్షకు సంఘీభావం



దీక్షా శిబిరంలో పాల్గొని మద్దతు తెలుపుతున్న నేవల్ సీఈ యూనియన్ సభ్యులు

గోపాలపట్నం: జీఎంగా ఉన్నప్పుడు స్టోరేజీ ఓటీ పద్ధతిలో పనిచేయించుకుని, సీజీఎం అయ్యాక అదే పద్ధతి చట్టవిరుద్ధమని చెబుతూ కార్మికులపై కక్ష సాధిస్తున్నారని ఎన్ఏడీ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రెడ్డి వెంకటరావు ఆరోపించారు. ఎన్ఏడీ సమీపంలో ఏర్పాటు చేసిన సత్యాగ్రహ దీక్షా శిబిరంలో ఆదివారం పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ ఓటీ ఇవ్వని యాజమాన్యం అదనపు గంటలు పని చేయించుకుంటున్నారన్నారు. సీజీఎం కార్మికుల చేత చట్టవిరుద్ధంగా పనిచేయిస్తున్నారని విమర్శించారు. ఆయనపై నౌకాదళ ప్రధానాధికారి ఫ్లాగ్ ఆఫీసర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. స్టోరేజీ ఓటీ ఇవ్వడంతోపాటు ఆరుగురిపై పెట్టిన పోలీస్ కేసును వెనక్కి తీసుకోవాలని, సస్పెండ్ చేసిన 36 మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేవల్ సీఈ యూనియన్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జి.అరుణ్‌కుమార్ తదితరులు తమ మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఏఈ సీఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సినీ రంగానికి ఎన్టీఆర్ సేవలు ఎనలేనివి



ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అప్పారావు

విశాఖ విద్య : సినీ రంగానికి ఎన్టీఆర్ సేవలు ఎనలేనివని ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు మళ్ల చిన్న అప్పారావు అన్నారు. ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఎన్ఏడీ జంక్షన్‌లో వేడుకలు నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి మళ్ల అప్పారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి, అందరికీ మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ తెలుగు సినిమా ఉన్నంత కాలం ఎన్టీఆర్ అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి భీశెట్టి రవీంద్ర, సభ్యులు ప్రసన్న, హుస్సేన్, గణేష్, వెంకట్రావు, శేఖర్, షాలినీ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ చంద్రశేఖర్

మర్రిపాలెం: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని కంచరపాలెం సీఐ చంద్రశేఖర్ సూచించారు. ఈ మేరకు ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం షాపుల వద్ద తాగి అల్లర్లు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, పద్ధతి మార్చుకోకపోతే అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు. వారి కదలికలపై నిత్యం నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగకుంటే చర్యలు

సీతమ్మధార: సమాజంలో అల్లర్లు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జి.వెంకటరావు హెచ్చరించారు. ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలి ముద్రలతోపాటు సంతకాలు సేకరించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్ల రోజు వారీ కార్యకలాపాలపై నిత్యం నిఘా ఉంటుందని, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మంచిగా లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.